

మినీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ స్నేహలత

## మినీ ఫంక్షన్‌హాల్‌కు శంకుస్థాపన

తిరుమలగిరి, జూలై 3 : మండలంలోని తొండ గ్రామంలో గల ఓ వెంచర్‌లో ప్రభుత్వానికి కేటాయించిన 10 శాతం భూమి 1.30 ఎకరాల్లో మినీ ఫంక్షన్ హాల్ ఏర్పాటు పనులను సోమవారం ఎంపీపీ స్నేహలత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శాతవాహనరావు, ఉప సర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తిరుమలగిరి, జూలై 3 : తిరుమలగిరి మున్సిపాలిటి పరిధిలోని 9వ వార్డులో సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కన్నెబోయిన లక్ష్మయ్య, యాకూబ్‌నాయక్, శంకర్‌నాయక్, రామ్‌సింగ్ ,రవి, నెహ్రూ పాల్గొన్నారు.



తాసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

**● తాసీల్దార్ అమీన్‌సింగ్**

మద్దిరాల, జూలై 3 : సమస్యలు సత్వరమే పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసీల్దార్ అమీన్‌సింగ్ తెలిపారు. సోమవారం తాసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వికాల్ పాటిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, ఏపీఎం మైసయ్య, ఏపీఓ వెంకన్న ఉన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

**● ఎస్పీ అపూర్వరావు**

నీలగిరి, జూలై 3: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఎస్పీ అపూర్వరావు అన్నారు. గ్రీవెన్స్ డేలో భాగంగా తన చాంబర్‌లో సోమవారం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 45 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి బాధితులకు భరోసా, నమ్మకం కలిగించేలా పనిచేయాలన్నారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. భూసమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ తదితర సమస్యలు వచ్చాయి. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేసి సత్వరం న్యాయం చేయాలని ఆదేశించారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**● చేనేత రివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం**



మాట్లాడుతున్న చేనేత రివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశం

మోత్కూరు, జూలై 3 : రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని చేనేత అండ్ జౌళిశాఖ రివిజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశం కోరారు. పట్టణంలోని చేనేత సహకార సంఘంలో చేనేత కార్మికులకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన చేనేత చేయూత, బీమా పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చేనేత చేయుత కింద కార్మికులు ప్రతినెలా రూ.2వేలు జమ చేస్తే, ప్రభుత్వం నెలకు రూ.4వేలు అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా చేనేత మిత్ర పథకంలో నూలుపై 40శాతం సబ్సిడీ గతంలో ఉన్న విధానం కాకుండా ప్రతి చేనేత కార్మికుడికి నేరుగా అకౌంట్లో డబ్బులు జమ చేస్తున్నదన్నారు. ఇల్లు, వర్క్ షెడ్ లేని వారు ఉంటే ఏడీఏకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా చేనేత అండ్ జౌళిశాఖ ఏడీఓ కె.విద్యాసాగర్ మాట్లాడారు. జల్ది రాములు అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో చేనేత కార్మిక సంఘం నాయకులు పాశికంటి లక్ష్మీనర్సయ్య, కొక్కుల సత్యానారాయణ, మంచె గోవర్ధన్, పోచం కన్నయ్య, గంగుల రాములు, నర్సయ్య, చుంచు లక్ష్మయ్య, గుండు వెంకటనర్సయ్య, వేముల నర్సయ్య పాల్గొన్నారు.

## బర్రెను కట్టేసిన తాడు తగిలి.. బైక్ నుంచి పడి వ్యక్తి మృతి

మోత్కూరు, జూలై 3 : బర్రెను కట్టిన తాడు తగిలి బైక్ నుంచి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని దొంగలరాపాక గ్రామానికి చెందిన సంగు కృష్ణారెడ్డి(38) పని నిమిత్తం గుండాల మండలంలోని సుద్దాలకు బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో మోత్కూరు పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ సమీపంలో పాడిగేదెను కట్టేసిన తాడు బైక్‌కు తగిలి కృష్ణారెడ్డి ఎగిరిపడ్డాడు. ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు చిన్న పిల్లలు, భార్య అనిత ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేట రూరల్, జూలై 3 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని పిల్లలమర్రి స్టేజి వద్ద 65వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచికి చెందిన కుక్కటి గోపాలక్రిష్ణ(30) హైదరాబాద్‌లోని అపోలో దవాఖానలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం కుసుమంచి నుంచి హైదరాబాద్‌కు బుల్లెట్ బైక్‌పై వెళ్తుండగా పిల్లలమర్రి స్టేజి వద్ద డివైడర్‌కు ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి కుక్కంటి రామ్మోహన్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ సాయిరాం తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

## ప్రభుత్వ పథకాలపై కళాజాత

తుంగతుర్తి, జూలై 3 : మండలంలోని కేశవాపురంలో ప్రభుత్వ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారధి జిల్లా కోఆర్డినేటర్ వేముల నరేశ్ బృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పింఛన్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కేసీఆర్ కిట్టు గురించి వివరించారు.

అర్వపల్లి : మండలంలోని కోడూరులో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సాంస్కృతిక సారధి కళాకారులు కళాజాత నిర్వహించారు. కార్యక్రమంలో టీం లీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, ఉపేందర్, రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం

నాగారం, జూలై 3 : మండలంలోని లక్ష్మాపురంలో సోమవారం నిరుపేద కుటుంబానికి చెందిన దుర్శోజు సోమయ్యకు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి శ్రీకాంత్‌రాజ్ కొత్త ఇల్లు కటించి ఇస్తున్నారు. సోమవారం ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటపల్లి సుధాకర్, శ్రీనివాస్, యాకోబు, మధుసూదన్, వెంకన్న, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నోట్ బుక్స్ పంపిణీ

తుంగతుర్తి, జూలై 7 : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు పట్టణానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఉప్పల అలేఖ్య సోమవారం నోట్ టుక్స్, షూ, పెన్నులు, టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 7న సర్వసభ్య సమావేశం

అర్వపల్లి, జూలై 3 : జాజిరెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 7న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కత రోజు ఉమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై విచారణ

మోత్కూరు, జూలై 3 : ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లపై ఎంఈఓ వి.శ్రీధర్ మున్సిపాలిటీ కేంద్రంలోని పలు పాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఫీజుల వివరాలు, పాఠ్య పుస్తకాల అమ్మకాలపై అడిగి తెలుసుకోవడంతో పాటు పాఠశాలలో మౌలిక వసతులు పరిశీలించారు. అంతకుముందు రికార్డులను పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు.

## పంటల సాగులో అధికారుల సూచనలు పాటించాలి

నూతనకల్, జూలై 3 : పంటల సాగులో వ్యవసయాధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మురళిబాబు తెలిపారు. సోమవారం మండలకేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు తక్కువ వర్షాపాతం నమోదు కావడంతో రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి పంటలు సాగు చేయాలన్నారు. సమావేశంలో ఏఈఓలు జానయ్య, మధు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

నూతనకల్, జూలై 3 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తోట్ల ప్రభాకర్‌గడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలకేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో వీరమల్లు, రమణయ్య, సుధాకర్, నర్సింహ పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ

అర్వపల్లి, జూలై 3 : మండలంలోని కోడూరు ప్రభుత్వ పాఠశాలలో 50మంది విద్యార్థులకు చెంచల సోమనాథం మనవరాలు పుట్టిన రోజు సందర్భంగా సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ తండు దశరథ, వార్డు సభ్యులు పోలగాని నాగయ్య, సైదులు, వెంకన్న, ప్రధానోపాధ్యాయులు అశోక్, సాయిరాం పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

## ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

నాగారం, జూలై 3 : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 2020–23 సంవత్సరాల ఉపాధి హామీ పనులపై సోమవారం రెండో విడుత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపీడీ పెంటయ్య మాట్లాడుతూ మండలంలో జరిగిన పనులు, రికార్డుల్లో నమోదు చేసిన పనుల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి చెల్లింపులు జరిగినట్లు గుర్తించామన్నారు. మండలంలో ఉపాధి పనుల్లో రూ.10లక్షల వరకు అవకతవకలు జరిగినట్లు గుర్తించామని, ఇందుకు సంబంధించి వివరణ అందజేయాలని, లేని పక్షంలో సొమ్మును రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణీవెంకన్న, ఎంపీడీఓ గాలి శోభారాణి, ఎంపీఓ దార శ్రీనివాస్, ఏపీఓ రవి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# అకారణంగా కొట్టిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

**● రైతు నేర్లకంటి మత్స్యగిరి**



నేర్లకంటి మత్స్యగిరి

మోత్కూరు, జూలై 3 : తమ భూమి తాము దున్నినందుకు అకారణంగా కొట్టిన మోత్కూరు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని ముశిపట్లకు చెందిన రైతు నేర్లకంటి మత్స్యగిరి కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. గ్రామంలోని సర్వే నంబర్ 44లో తన తండ్రి సత్తయ్య పేరున 0.29ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి విషయమై గ్రామానికి చెందిన బీమిడి వీరారెడ్డి కుమారులు తిర్మల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తమదని అడ్డు వచ్చారని తెలిపారు. సర్వేకు తాసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవడంతో 2023 ఏప్రిల్ 28న మండల సర్వేయర్ భూమిని కొలిచి సాక్షుల సమక్షంలో హద్దులను ఏర్పాటు చేశారన్నారు. తాను ఆదివారం భూమిని దున్నడంతో తిర్మల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డికి సంబంధించిన భూమిని నీవెట్ల దున్నుతావంటూ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కొట్టారని ఆరోపించారు. ఇంజక్షన్ ఆర్డర్ ఉంటే తప్ప నీవు భూమి మీదికి పోవద్దని హెచ్చరికలు చేశారని వాపోయాడు. తనను అకారణంగా కొట్టిన ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిపై చర్య లు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరాడు.

### విచారించా తప్ప కొట్టలేదు

నేను నేర్లకంటి మత్స్యగిరిని కొట్టలేదు. వేరొకరి భూమిని దున్ని కబ్జా పెట్టడంతో స్టేషన్‌కు పిలిచి విచారించా. బీమిడి తిర్మల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మత్స్యగిరిపై కేసు నమోదు చేశా.

– ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి